సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
78932 44734
నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

ఆత్మీయ పలకరింపు



అపోలో ఆస్పత్రి వద్ద జియ్యాని శ్రీధర్‌ను అభినందిస్తున్న సీఎం జగన్

గోపాలపట్నం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని నగరంలోని అపోలో ఆస్పత్రిలో గురువారం డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ కలిశారు. శ్రీధర్ పార్టీ కోసం బాగా పని చేస్తున్నావని సీఎం అభినందించారని శ్రీధర్ తెలిపారు. ఇది తన జీవితంలో మరిచిపోలేని ఘటనగా పేర్కొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



శాంతినగర్ పార్కులో పనులు పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్

గోపాలపట్నం: జీవీఎంసీ 52వ వార్డు పార్కుల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను గురువారం డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ పరిశీలించారు. శాంతినగర్ పార్కులో మొక్కలు నాటేందుకు ఎర్రమట్టి వేశారు. మొక్కలు ఎలా నాటాలో ఆయన సూచించారు. శాంతినగర్ పార్కు, కరాసా పార్కు, హిందూ, ముస్లిం, క్రిస్టియన్ శ్మశాన వాటికల్లో బ్యూటిఫికేషన్ పనులు చురుగ్గా సాగుతున్నాయని చెప్పారు. వీటిల్లో పచ్చదనాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఇందుకు సహకరిస్తున్న అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఆకట్టుకున్న చిత్తరువులు



చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

మల్కాపురం: మల్కాపురం శాఖా గ్రంథాలయంలో గురువారం చిత్రలేఖనం పోటీలు జరిగాయి. వేసవి తరగతుల్లో భాగంగా మల్కాపురం శాఖ గ్రంథాలయం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సుమారు 30 మంది చిన్నారులు పాల్గొని వివిధ చిత్రాలను చిత్రించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి అజేయ్‌కుమార్ మాట్లాడుతూ వేసవి తరగతుల్లో భాగంగా చిన్నారులకు పలు అంశాలపై శిక్షణ ఇచ్చామన్నారు. కార్యక్రమంలో రచయితలు, కవులు పాల్గొన్నారు.

అచీవర్స్ డే విజయవంతంపై వీసీ హర్షం



కార్యక్రమంలో పాల్గొన్న ఏయూ వీసీ ప్రసాదరెడ్డి, ఆచార్యులు

ఎంవీపీ కాలనీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలల జాబ్స్ అచీవర్స్ డే విజయవంతం కావడంపై వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమ నిర్వాహకులు, ఇంజినీరింగ్ కళాశాల ఆచార్యులు, సిబ్బంది, వలంటీర్లతో వీసీ గురువారం ఏయూ కెమికల్ ఇంజినీరింగ్ విభాగంలో సమావేశమై అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల ప్రిన్సిపాల్, ఆచార్యులు, ప్లేస్‌మెంట్ అధికారి సంపూర్ణ కృషితోనే ఈ ఏడాది విద్యార్థులకు అత్యధిక ఉద్యోగాలు సాధ్యమయ్యాయన్నారు. రెక్టార్ ఆచార్య సమత, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య శశిభూషణరావు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ వెస్ట్
9398184202, 9912440606
సాక్షి

సమస్యలతో సహవాసం

- ఇళ్ల పట్టాలు, రహదారులకు నోచుకోని దుర్గాపురం వాసులు
- దీర్ఘకాలంగా దొరకని పరిష్కారం
- ప్రజాప్రతినిధులు పట్టించుకోవాలని విజ్ఞప్తి



దుర్గాపురం - కరాసా రైల్వే ట్రాక్ దారి



గ్రామంలో సంచరిస్తున్న కోతులు



దుర్గాపురానికి వెళ్లే ప్రధాన రహదారిలో నేవీ అధికారుల గేటు

గోపాలపట్నం: 'మా సమస్య దీర్ఘకాలికం.. పరిష్కారానికి నోచుకోని వైనం.. గ్రామం వెలసిన స్థలం విశాఖ పోర్టు ట్రస్ట్‌ది. దాన్ని నేవీకి లీజ్‌కు గతంలో ఇచ్చారు. దీనికి ఆనుకుని రైల్వే ట్రాక్‌లు ఉన్నాయి. ఆయా సంస్థలు స్థలాల్ని కాపాడుకోవడం కోసం భారీ గోడలను నిర్మించేశారు. దీంతో మా గ్రామం చుట్టూరా గోడల మధ్య జైల్లో ఉన్నట్లుగా ఉంది. ఎంతో మంది అధికారులు, నాయకులు ఈ గ్రామానికి వచ్చి పరిశీలించారు. మా గోడు విన్నారు. అయినా ఏ ప్రయోజనం లేకుండా పోయింది. నేవీ అధికారులు ఎత్తయిన గోడలు నిర్మించేశారు. దీంతో మా గ్రామంలోకి వేళ్లేందుకు దారి లేకుండా పోయింది. ఇపుడు నేవీ రహదారి(ఎన్‌ఏడీకి వెళ్లే రోడ్డు)ని వాడుతున్నారు. రాత్రయితే వారితో నానా తంటాలు పడాల్సి వస్తోంది. ఇంటికి చుట్టాలు వస్తే నేవీ అధికారులకు సమాధానం చెప్పుకోవాల్సిన పరిస్థితి. మరో వైపు రైల్వే పట్టాలు దాటి కరాసా వైపు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణించాల్సి వస్తోంది' అని దుర్గాపురం వాసులు వాపోతున్నారు.

70 ఏళ్లుగా ఇదే పరిస్థితి..

సుమారు 70 ఏళ్ల కిందట ఎన్ఏడీ సమీపంలో దుర్గాపురం గ్రామం ఏర్పడింది. ప్రస్తుతం 57వ వార్డులో ఈ ప్రాంతం ఉంది. ఇక్కడ 350 కుటుంబాలు నివసిస్తున్నాయి. ఇక్కడి పోర్టు స్థలంలో కూలీ పనుల కోసం వచ్చిన వారు పాకలు వేసుకుని జీవించే వారు. ఆ తరువాత ఇదో గ్రామంగా ఏర్పడింది. ఈ పోర్టు స్థలాన్ని నేవీకి లీజ్‌కిచ్చారు. దీంతో ఇక్కడ నివసించే వారికి ఎటువంటి హక్కు లేకుండా పోయింది.

ఇళ్ల పట్టాల కోసం ఎదురుచూపులు..

ఇక్కడ స్థిర నివాసంగా ఏర్పడిన గ్రామస్తులు ఇళ్ల పట్టాల కోసం దశాబ్దాలుగా అధికారులు, నాయకుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతూనే ఉన్నారు. జాయింట్ కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్‌లు పలు మార్లు ఈ ప్రాంతానికి వచ్చినా ఫలితం లేకపోయిందని నివాసులు చెబుతున్నారు. అధికారులు, నాయకులు మారినా.. తమ బతుకుల్లో మార్పు రావడం లేదని వాపోతున్నారు. పోర్టు అధికారులతో స్థల బదలాయింపు ద్వారా ఈ గ్రామస్తులకు ఇళ్ల పట్టాలు అందించి, రహదారి సౌకర్యం కల్పించాలని, గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని కోరుతున్నారు. దీనిపై ప్రజాప్రతినిధులు, జిల్లా స్థాయి ఉన్నతాధికారులు తగు చర్యలు చేపట్టాలని వేడుకుంటున్నారు.

కోతులు, పందులతో ఇక్కట్లు..

దుర్గాపురం వాసులు పందులు, కోతుల బెడదతో తీవ్ర ఇబ్బందులు పడతున్నారు. వేకువజాము 3 గంటల నుంచి ఉదయం 10 గంటల వరకు గ్రామంలో కోతులు సంచరిస్తున్నాయి. దీంతో బయటకు రావాలంటే గ్రామస్తులు భయపడుతున్నారు. చాలా మంది కోతుల దాడికి గురై గాయాల పాలయ్యారని వాపోతున్నారు. రాత్రి, పగలు లేకుండా పందులు ఇళ్లలోకి చొరబడి ఇబ్బందులు గురిచేస్తున్నాయని చెబుతున్నారు. కోతులను పట్టుకునేందుకు అటవీ అధికారులు వచ్చి చూసి వెళ్లేరే తప్ప ఏ ప్రయత్నాలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇళ్ల పట్టాలు ఇప్పించండి



ఇళ్ల పట్టాలు ఇస్తామని మమ్మల్ని నమ్మబలికారు. ఇంతవరకు ఏ ఒక్కరికీ రాలేదు. గతంలో లోపాయకారంగా మా గ్రామాన్నే తరలించేందుకు ప్రయత్నాలు సాగించారు. ఇందుకోసం రెవెన్యూ అధికారులు సన్నాహాలు చేసినట్లు మాకు సమాచారమొచ్చింది. ఆప్రయత్నం నిలిచిపోయింది. ప్రజాప్రతినిధులు మాకు న్యాయం జరిగేలా చూడాలని కోరుతున్నాం.

– చందాపు గుణేశ్వరరావు, గ్రామ కమిటీ ప్రెసిడెంట్

కోతులతో భయంగా ఉంది



మా గ్రామంలో కోతుల సంచారంతో భయాందోళనలుగా ఉంది. గ్రామస్తులపై దాడికి పాల్పడుతున్నాయి. బయటకు వచ్చి ఏ పని చేయలేకపోతున్నాం. నాపై దాడి చేసి గాయపరిచాయి. వీటిని అరికట్టేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

– కుమిలి విజయకుమారి దుర్గాపురం

ఎన్నో ఏళ్ల సమస్య పరిష్కరించాలి



మా గ్రామ సమస్య ఎన్నో ఏళ్లుగా ఉంది. అధికారులు, నాయకుల వద్ద మొరపెట్టుకున్నా.. పరిష్కారం కాలేదు. సదుపాయాలు లేక చాలా ఇబ్బందులు పడుతున్నాం. మా సమస్యను పరిష్కరించి ఇళ్ల పట్టాలు, రహదారి సౌకర్యం కల్పించాలి.

– గొడ్డేపల్లి హేమలత, స్థానికురాలు

రాష్ట్రంలో ప్రజా పాలన



ప్రభుత్వ పథకాల బ్రోచర్‌ను లబ్ధిదారులకు అందజేస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

- సంతోషంగా అన్ని వర్గాల ప్రజలు
- టీడీపీ, జనసేనలకు మాత్రం కలవరం
- వైఎస్సార్‌సీపీ 'పశ్చిమ' సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్

మల్కాపురం: రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం నడుస్తోందని వైఎస్సార్‌సీపీ పశ్చి నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. జీవీఎంసీ 61వ వార్డు ఆర్‌కేపురం, ఇండస్ట్రియల్‌కాలనీ సచివాలయాల పరిధిలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆడారి ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ జగనన్న పాలనలో అంతా ఆనందంతో ఉన్నారని చెప్పారు. ఒక్క పచ్చ నేతలు,పచ్చ పత్రికలు, దత్తపుత్రుడు తప్పా అని ఎద్దేవా చేశారు. పార్టీలు చూడకుండా జగనన్న పథకాలు అందిస్తుంటే ఎక్కడ తమ పార్టీ వారు చేయి జారుతారో అని టీడీపీ,జనసేన తదితర పార్టీల నాయకులు కలవరం చెందుతున్నారని ఆరోపించారు. హుద్ హుద్ తుపాను బాధితులకు నాడు దాతలు అందించిన సాయం ఏమైందో టీడీపీ నాయకులు చెప్పగలరా అని ప్రశ్నించారు. టీడీపీ పాలనలో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో దించిన ఘనత టీడీపీది కాదా అని ప్రశ్నించారు. సొంత వారి కోసం పని చేసిన ఘనత చంద్రబాబుది అయితే, నమ్ముకున్న ప్రజల కోసం నిద్ర లేకుండా శ్రమిస్తున్న ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదని వివరించారు. వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డికి మరో సారి అవకాశం కల్పించాలని కోరారు.వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు దాడి సత్యనారాయణ,సోనూ,మూగి సూర్యనారాయణ,కేబుల్ వాసు (జీవీఎస్ఎన్ రాజు),స్వప్న తదితరులు పాల్గొన్నారు.

బీసీ కార్పొరేషన్లకు నిధులివ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న కుమారస్వామి

అల్లిపురం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి వెనుకబడిన కులాలకు అధిక ప్రాధాన్యతనిస్తున్నారని జాతీయ బీసీ సంక్షేమ సంఘం విశాఖ జిల్లా అధ్యక్షుడు డబ్బీరు కుమారస్వామి కొనియాడారు. గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ సమస్యలపై సుదీర్ఘపోరాటం చేస్తున్న జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్యకు రాజ్యసభ పదవినిచ్చి గౌరవించారన్నారు. తద్వారా బీసీలు జాతీయ వేదికగా తమ గొంతు వినిపించే అవకాశం కలిగిందన్నారు. కానీ బీసీ కార్పొరేషన్లలో తగినన్ని నిధులు లేక అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. తక్షణమే ముఖ్యమంత్రి వాటికి నిధులు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. అదే విధంగా రాష్ట్రంలో ఖాళీగా వున్న ప్రభుత్వ ఉద్యోగాలకు తక్షణమే నోటిఫికేషన్లు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి వారణాసి అన్నాజీరావు, జిల్లా యువజన అధ్యక్షుడు ఉద్దండరావ్ వెంకటగిరి, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపనలో పాల్గొన్న ఆడారి ఆనంద్‌కుమార్, కార్పొరేటర్ లావణ్య

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు గుల్లలపాలెంలో సీసీ రోడ్డు నిర్మాణానికి కార్పొరేటర్ గులిగిందల లావణ్య ఆధ్వర్యంలో గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ అనేక అభివృద్ధి పనులతో నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. పలు వార్డుల్లో కోట్ల రూపాయల జీవీఎంసీ నిధులతో పలు అభివృద్ధి పనులు జరిపామన్నారు. 58వ వార్డు ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని సదుపాయాలను కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు గులిగిందల కృష్ణ, వ్యవసాయ మార్కెటింగ్ బోర్డు డైరెక్టర్లు తోనంగి వెంకటరమణి యాదవ్, చుక్క వరలక్ష్మి, సంతోష్, మమతా, బర్రి సంతోష్, ముకుంద, కోట కృష్ణ, కీర్తి, కనకమహలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మనిషి కవి గోపి



కవి గోపికి పురస్కారం ప్రదానం చేస్తున్న హర్షవర్ధన్, రఘురామారావు

సీతంపేట: కవిత్వం అంటే మనిషిని కలిసినట్టు ఉండాలని భావించే మహోన్నత వ్యక్తి, ప్రముఖ కవి, విమర్శకుడు ఎన్.గోపి అని పలువురు వక్తలు కొనియాడారు. విశాఖ రసజ్ఞ వేదిక ఆధ్వర్యంలో గురువారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జగదీశ్వరి ఫౌండేషన్ 2020 సాహిత్య పురస్కారం ప్రదానోత్సవం జరిగింది. ముఖ్య అతిథి రచయిత వి.హర్షవర్ధన్ చేతుల మీదుగా కవి గోపికి జగదీశ్వరి పురస్కారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా విశాఖ రసజ్ఞ వేదిక వ్యవస్థాపకుడు డాక్టర్ జి.రఘురామారావు మాట్లాడుతూ మనిషి కవి గోపి అని, అయన రాసిన కవితా సంకలనం చదివితే ఆయన దృక్పథం, ఆలోచన తెలుస్తుందన్నారు. జగదీశ్వరి చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు ఎన్.రామకృష్ణ మాట్లాడుతూ పేద విద్యార్థుల చదువుకు ఆర్థిక సాయం అందించి, వారి కాళ్లపై వారి నిలబడేలా ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో 2019లో ట్రస్టు స్థాపించినట్లు తెలిపారు. తన భార్య జగదీశ్వరికి సాహిత్యం, సంగీతంపై ఎంతో మక్కువని, ఆమె జ్ఞాపకార్థం ప్రతి ఏటా విశిష్ట సాహితీవేత్తలకు జగదీశ్వరి పురస్కారం ప్రదానం చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో విశాఖ రచయితల సంఘం అధ్యక్షుడు అడపా రామకృష్ణ, పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు.

మంత్రులకు ఘన స్వాగతం



విమానాశ్రయంలో మంత్రులకు స్వాగతం పలుకుతున్న బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: విశాఖ విమానాశ్రయంలో డిప్యూటీ సీఎం నారాయణ స్వామి, పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కే రోజాకు సాదర స్వాగతం లభించింది. జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు వారికి పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

సిరులతల్లికి సహస్ర తులసీదళార్చన



సహస్ర తులసీదళార్చన సేవలో కనకమహాలక్ష్మి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి గురువారం సహస్ర తులసీదళార్చన ఘనంగా నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు జరిగిన ఈ పూజతోపాటు పంచామృతాభిషేక సేవ, శ్రీచక్రా నవవర్ణార్చన, లక్ష్మీ హోమంలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. తులసీదళార్చనలో పరోక్ష పద్ధతిలో పాల్గొనే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్త రోడ్డు శాఖ, అకౌంట్ నంబర్ 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో వెంపలి రాంబాబు, ఆలయ పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు క్షీరాభిషేక సేవ..

సిరులతల్లి కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించనున్నారు. రూ.500 రుసుం చెల్లిస్తే ఈ ప్రత్యేక పూజలో పాల్గొనేందుకు దంపతులను లేదా ఇద్దరిని అనుమతించనున్నారు. వివరాలకు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు.

నేటి నుంచి ఫ్యాబ్రిక్ పెయింటింగ్‌పై శిక్షణ

సీతమ్మధార: వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునేందుకు బాల వికాష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 12 నుంచి ఐదు రోజుల పాటు ఫ్యాబ్రిక్ పెయింటింగ్‌పై వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని శ్రీకృష్ణ మందిరం గురువాయూరప్పన్ ఆవరణలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఉచితంగా శిక్షణ ఉంటుంది. 14 నుంచి 40 ఏళ్ల వయసు గల బాలికలు, మహిళలు పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. వివరాలకు 85200 04288 నంబర్‌లో సంప్రదించవచ్చు.

నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం

సింహాచలం: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పలు కార్యక్రమాలు అమలు చేస్తుందని డీఈవో చంద్రకళ అన్నారు. పెందుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో భద్రపరిచిన జగనన్న విద్యా కానుక కిట్స్ స్టాక్ పాయింట్‌ను గురువారం ఆమె పరిశీలించారు. విద్యా సంవత్సరం ప్రారంభమైన తర్వాత ఎలాంటి ఆటంకం లేకుండా కిట్స్ పంపిణీ చేయాలని సూచించారు. పాఠశాలల వారీగా విద్యార్థులకు పంపిణీ చేయాల్సిన జేవీ కిట్లు వివరాలతో రిజిస్టర్ నిర్వహించాలని ఆదేశించారు. మెరుగైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులంతా కృషి చేయాలని సూచించారు. తదుపరి నాడు–నేడు రెండో దశలో ఎంపికైన పెందుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జుత్తాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నరవ వానిపాలెం, దువ్వపాలెం, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలు, పులగాలిపాలెం ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించారు. నరవానిపాలెం పాఠశాలలో వుయ్ లవ్‌రీడింగ్‌లో భాగంగా సమ్మర్ క్యాంప్ యాక్టివిటీస్, బుక్స్ పరిశీలించారు. విద్యార్థులకు పలు సూచనలు చేశారు. అలాగే పది కాంపోనెంట్స్ పనులను జూన్ 11లో పూర్తి చేయాలని మండల విద్యాశాఖాధికారి పైడపు నాయుడును ఆదేశించారు. ఎంఈవో పైడపునాయుడు మాట్లాడుతూ పెందుర్తి మండలానికి తొలి విడతగా పాఠ్యపుస్తకాలు 19,435, నోట్ పుస్తకాలు, 59,086 వచ్చాయన్నారు. కార్యక్రమంలో నాడు–నేడు ఫీల్డ్ ఇంజినీర్ పి.పద్మ, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం



శైలజ

సింహాచలం: యువతి అదృశ్యంపై పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఏఎస్ఐ ఎస్.కె.సత్యనారాయణ తెలిపిన వివరాలు.. పెందుర్తిలోని సింహగిరినగర్ సంపత్ రెసిడెన్సీలో ఉంటున్న నడుపూరి అప్పారావు కుమార్తె నడుపూరి శైలజ(23) ఎమ్మెస్సీ పూర్తి చేసింది. ఆమె ఈనెల 11వతేదీ గురువారం మధ్యాహ్నం 12గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఈమేరకు శైలజ తండ్రి అప్పారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ తెలిపారు.

జీవీఎంసీ చలివేంద్రాల్లో మజ్జిగ పంపిణీ



ఊర్వశి జంక్షన్ జీవీఎంసీ చలివేంద్రంలో బాటసారులకు మజ్జిగ అందజేస్తున్న సిబ్బంది



ఆర్ అండ్ బీ బస్‌స్టాప్ వద్ద చలివేంద్రంలో మజ్జిగ పంపిణీని పరిశీలిస్తున్న ఎస్ఈ వేణుగోపాల్

కంచరపాలెం: వేసవి కాలం నేపథ్యంలో జీవీఎంసీ జోన్–5 పరిధిలో ఏర్పాటు చేసిన చలివేంద్రాల్లో గురువారం నుంచి తాగునీరుతోపాటు మజ్జిగ పంపిణీ చేస్తున్నట్లు జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ తెలిపారు. జ్ఞానాపురం, కంచరపాలెం, తాటిచెట్లపాలెం, అక్కయ్యపాలెం, రైల్వే న్యూకాలనీ, ఊర్వశి కూడలి, ఐటీఐ కూడలి, 104 ఏరియా, మర్రిపాలెం, ఆర్ అండ్ బీ జంక్షన్, కరాసా, ఎన్ఏడీ, బుచ్చిరాజుపాలెం, గోపాలపట్నం, మల్కాపురం, శ్రీహరిపురం ప్రాంతాల్లోని చలివేంద్రాల్లో బాటసారులకు మజ్జిగ అందించామన్నారు. జీవీఎంసీ ఇంజినీరింగ్ విభాగం ఎగ్జిక్యూటివ్స్ ఏ అండ్ బీ శ్రీనివాస్, టి.ప్రసన్నరెడ్డి, వాటర్ విభాగం ఈఈలు సుధాకర్, సూరిశెట్టి శేఖర్ తదితరులు మజ్జిగ పంపిణీని పర్యవేక్షించారు.

మజ్జిగ పంపిణీ పరిశీలన

మర్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు జాతీయ రహదారి వద్ద ఆర్ అండ్ బీ బస్‌స్టాప్, జంక్షన్‌లోని చలివేంద్రంలో గురువారం బాటసారులకు మజ్జిగ అందజేశారు. జీవీఎంసీ వాటర్ సప్లై ఎస్ఈ వేణుగోపాల్, ఏఈ శ్రీనివాస్‌లు పలు చలివేంద్రాలను సందర్శించారు. అక్కడ సిబ్బంది సరిగ్గా మజ్జిగ పంపిణీ చేస్తున్నారా లేదా అని పరిశీలించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ జీవీఎంసీ ఆధ్వర్యంలో జోన్–5 పరిధిలో జ్ఞానాపురం నుంచి ఆర్ అండ్ బీ వరకు మొత్తం 15 చలివేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండటం వల్ల బాటసారులకు మజ్జిగ అందిస్తున్నామని చెప్పారు. ఎండలో ప్రయాణించే వాహన చోదకులు, పాదచారుల దాహార్తిని తీర్చుకునేందుకు వీలుగా ఉండటం వల్ల వారు హర్షం వ్యక్తం చేశారు.

యాగానికి తరలివెళ్లిన యాత్రికులు



విజయవాడ బయలుదేరిన బస్సు

సింహాచలం: రాష్ట్ర దేవదాయశాఖ ఆధ్వర్యంలో విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించనున్న యాగానికి భక్తులు తరలివెళ్లారు. శుక్రవారం నుంచి ఈనెల 17 వరకు జరగనున్న అష్టోత్తర శత కుండాత్మక చండీ, రుద్ర, రాజశ్యామల, సుదర్శన సహిత శ్రీలక్ష్మీ మహా యజ్ఞం ప్రారంభానికి సింహాచలం దేవస్థానం ఉచిత బస్సు ఏర్పాటు చేసింది. ఈ బస్సు గురువారం రాత్రి పలువురు భక్తులతో బయలు దేరింది. దేవస్థానం ఏఈవో ఆనంద్‌కుమార్ కొబ్బరికాయ కొట్టి బస్సును ప్రారంభించారు. మార్గ మధ్యలో అనకాపల్లి, తదితర ప్రాంతాల్లో భక్తులు కలుస్తారని ఏఈవో తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ గోపీనాథ్, పీఆర్వోనాయుడు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు స్వర్ణపుష్పార్చన ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అలంకరించి కల్యాణమండపంలోని వేదికపై అధిష్టంపజేశారు. 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తరశతనామావళి నిర్వహించారు. పూజలో పాల్గొన్న ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు ఈపూజ నిర్వహించారు. ఆలయ ఏఈవో ఇజిరోతు శ్రీనివాసరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేసి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం,జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ వెస్ట్
9912222753, 9705933394
Office mail : sakshiadvtvsp@gmail.com